క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో భరణి కావళ్లు



సముదాయంలో భరణి కావళ్లతో భక్తులు

నారాయణవనం: తమిళ ఆడి నెల కృత్తిక సందర్భంగా శనివారం భరణి కావళ్లు ఎత్తారు. ఆలయాల్లో శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రమణ్యస్వామికి ప్రత్యేక అభిషేకాలను చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. టీటీడీ అనుబంధ పరాశురేశ్వరస్వామి, అగస్తీశ్వర స్వామి ఆలయలతో పాటు బస్టాండ్ సమీపంలోని వినాయకుని ఆలయంలో, కైలాసనాథకోన శివశక్తి ఆశ్రమంలో స్వామివార్లను భక్తులు దర్శించుకున్నారు. తమ ఇళ్లలో పండుగను చేసుకున్న మండల వాసులు ఉదయం నుంచి భరణి కావళ్లు ఎత్తి ఊరేగింపుగా తిరుత్తణి, రామగిరి, కార్వేటినగరం, పుత్తూరులోని సుబ్రమణ్యస్వామి ఆలయాలకు వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు.

పోలీసుస్టేషన్‌లో శ్రమదానం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని పోలీసుస్టేషన్ అవరణలోని పరిసరాలను శనివారం ఎస్ఐ విశ్వనాథనాయుడు, సిబ్బందితో కలసి చెత్త, చెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మునిరాజా, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ



విద్యా సామగ్రిని పంపిణీ చేస్తున్న ఎంఈఓలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పుత్తేరి ఆదర్శ పాఠశాల విద్యార్థులకు శనివారం రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శిరీష స్కానింగ్ సెంటర్ వారి సౌజన్యంలో విద్యాసామగ్రిని ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో గౌరవంగా బతకాలంటే విద్యతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో దాతలు శిరీష, ఎస్టీయూ నాయకులు రామచంద్రయ్య, గజేంద్ర, బాలాజీ, బాలసుబ్రమణ్యం, గ్రామసర్పంచ్ రామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

శనీశ్వరస్వామికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శనీశ్వరస్వామివారికి శనివారం శాస్త్రోక్తంగా తైలాభిషేకం చేశారు. స్వామివారికి నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళ, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి విశేషాలంకరణ చేసి, ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు.

వాహన తనిఖీలు



వాహన తనిఖీలు చేస్తున్న సీఐ నాగార్జున

శ్రీకాళహస్తి: పట్టణంలోని నంది సర్కిల్ వద్ద శనివారం సీఐ నాగార్జునరెడ్డి వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సు లేని వాహనాలకు జరిమానా విధించారు. ఆయన మాట్లాడుతూ వాహనచోదకులందరూ తమ వద్ద తప్పనిసరిగా వాహనానికి సబంధించిన పత్రాలు, లైసెన్సులు ఉంచుకోవాలన్నారు. అలాగే ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్, కారు, ఇతర వాహనచోదకులు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలన్నారు.

టీడీపీ కార్యకర్తకు గాయం



గాయపడిన టీడీపీ కార్యకర్త

రేణిగుంట: సీఎం పర్యటనలో భాగంగా తిరుపతి విమానాశ్రయం వద్ద శనివారం ఓ టీడీపీ కార్యకర్త గాయపడ్డాడు. ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుపతి జిల్లా పర్యటన కోసం విమానాశ్రయానికి వస్తున్నాడన్న సమాచారంతో టీడీపీ నాయకుడు, వడమాల పేటకు చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకటేశ్వరరావు విమానాశ్రయానికి చేరుకున్నారు. ముఖ్యమంత్రి వెలుపలకు వచ్చిన తర్వాత టర్మినల్ ఎదురుగా ఉన్న కాలువపై నడిచి వస్తుండగా కాలువపై ఉన్న బండ విరగడంతో ఆయన కాలువలో పడ్డాడు. ఈ ఘటనలో ఆయన కాలుకు బండ తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అధికారులు అతన్ని దగ్గరలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఇదివరకే అనేకసార్లు..

విమానాశ్రయం ఆవరణలో ఉన్న కాలవలపై వేసిన బండలు నాశిరకంగా ఉండడంతో ఇదివరకే పలుసార్లు బండలు విరిగి పలువురికి గాయాలైన సందర్భాలున్నాయి. గతంలో ఇలాగే వీఐపీల పర్యటన సందర్భంగా వచ్చిన కార్యకర్తలు, ప్రోటోకాల్ నిర్వహించే సిబ్బంది కాలువలో పడి గాయపడ్డారు. విమానాశ్రయ అధికారులు దృష్టి పెట్టి కాలువపై ఉన్న బండలను మార్పు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఆడి ఉత్సవం.. ఏర్పాట్లు ఘనం


- నేడు ఆడికృత్తిక





కుమారస్వామి ఆలయంలో పుష్పాలంకరణ, (ఇన్‌సెట్) విజ్ఞానగిరి వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ కటౌట్

విజ్ఞానగిరిపై ఉన్న శ్రీవల్లీ, దేవసేన సమేత కుమారస్వామి ఆలయంలో ఆదివారం ఆడికృత్తిక మహోత్సవం జరగనుంది. ఈ నేపథ్యంలో ఉదయం నుంచి రాత్రి వరకు శ్రీకాళహస్తి, పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో విజ్ఞానగిరికి రానున్నారు. ఈ క్రమంలో అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. క్యూలు, ఇతర వసతులు కల్పించారు. ఉదయం 9 గంటలకు స్వామి అమ్మవార్లు ఇంద్ర విమానం, రాత్రి మయూర వాహనంపై విహరించనున్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ కాంతులతో విజ్ఞానగిరి కాంతులీనుతోంది. ఆడికృత్తికకు శ్రీవల్లీ దేవసేన సమేత కుమారస్వామి ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేశారు. – శ్రీకాళహస్తి



విద్యుత్ కాంతుల్లో విజ్ఞానగిరి ఆలయం



దుస్తులు మార్చుకునే శిబిరం



ఆలయంలో ఏర్పాటు చేసిన క్యూలు



కల్యాణకట్ట

అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

వరదయ్యపాళెం: నియోజకవర్గంలో సుదీర్ఘకాలంగా అభివృద్ధికి నోచుకోని నాగలాపురం – చిన్నపాండూరు మార్గంలోని టీపీ కోట ఆర్ అండ్ బీ రోడ్డును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సీఎం చంద్రబాబు నాయుడును వేడుకున్నారు. శనివారం తిరుపతి పర్యటనకు వచ్చిన సీఎంను రేణిగుంట విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే తన నియోజకవర్గంలోని టీపీ కోట రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



ఆలయం వద్ద జస్టిస్ రామచంద్ర డిహుద్దర్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం పలువురు ప్రముఖులు వేర్వేరుగా దర్శించుకున్నారు. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామచంద్ర డి హుద్దర్, మహారాష్ట్ర ఎంపీ శ్రీకాంత్ షిండే దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఆలయ దక్షిణగోపురం వద్ద ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేద పండితులు వారిని ఆశీర్వదించి, స్వామి అమ్మవార్ల జ్ఞాపిక తీర్థప్రసాదాలు అందజేశారు.

తూతూమంత్రంగా ‘సుపరిపాలన తొలి అడుగు’



ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్‌రెడ్డి పరిచయ కార్యక్రమంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

నాగలాపురం: మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమం తూతూ మంత్రంగా సాగింది. సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కో ఆర్డినేటర్‌గా నియమితమైన శంకర్‌రెడ్డి తొలిసారిగా మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో నిర్వహించిన పరిచయ, సుపరిపాల తొలి అడుగు కార్యక్రమాలకు ఆదరణ కరువైంది. సమావేశంలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. వచ్చిన అరాకొర జనం కూడా టీడీపీ నేతలు ముట్టజెప్పిన తాయిళాలతో హాజరైనట్లు అక్కడ సమావేశానికి మహిళలు చర్చించుకోవడం గమనార్హం. శంకర్ రెడ్డి వెంట ఏడు మండలాల నుంచి టిడిపి నాయకులు హాజరైనప్పటికీ మండలం నుంచి ఆశించిన స్థాయిలో టీడీపీ శ్రేణులు, ప్రజలు రాకపోవడంతో కోఆర్డినేటర్ ఒకింత నిరుత్సాహానికి గురైనట్లు సమాచారం. సమావేశానికి హాజరైన నాయకులు కేవలం వైఎస్సార్ సీపీని జగన్‌మోహన్‌రెడ్డిని గురించి విమర్శలు చేసేందుకే ప్రాధాన్యత కల్పించారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో సమావేశానికి హాజరైన మహిళలు లోలోపల కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం





బుచ్చినాయుడుకండ్రిగ: ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీఓ, నాగలాపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ: ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ వెంకటరత్నమ్మ తెలిపారు. శనివారం బుచ్చినాయుడుకండ్రిగలో ఆమె విద్యార్థులతో కలసి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగంతో ఆరోగ్యం దెబ్బతింటుందని, పర్యవరణం నాశనం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 మునిసుబ్రమణ్యం, ప్రధానోపాధ్యాయులు రమణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం నిషేధించాలి

నాగలాపురం: ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని పంచాయతీ కార్యదర్శి శంకరయ్య అన్నారు. శనివారం పంచాయతీ కార్యదర్శి శంకరయ్య, ఎంఈఓ బాబయ్య ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాఠశాల నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రజలకు, దుఖాణ యజమానులకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. అనంతరం ప్లాస్టిక్ వినియోగం నిషేధంపై అధికారులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ కలన్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమానికి వందేళ్లు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రజా శ్రేయెస్సు కోసం ఆవిర్భవించిన సీపీఐకి వందేళ్లు పూర్తి అయ్యాయని, పేదల సంక్షేమానికి, గ్రామీణాభివృద్ధికి సీపీఐ పోరాటంతో ముందుకు సాగుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి తెలిపారు. మండలకేంద్రంలోని మార్కెట్ యార్డులో ఆ పార్టీ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య అధ్యక్షతన నాలుగు మండలాల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఉద్యమానికి వందేళ్లు పూర్తి అయ్యాయని, ఈ పోరాటంతో బ్రిటీష్ వారిని ఎదిరించిందని, భూపోరాటాల ద్వారా లక్షలాది మందికి పేదలకు భూమి పంపిణీ చేసిందని, దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నంపెంచలయ్య, నాయకులు చింతపూడి రమణయ్య పాల్గొన్నారు.

తిరుచ్చిపై ఆండాళ్ అమ్మవారు



తిరుచ్చి వాహనంపై ఆండాళ్ అమ్మవారు

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆండాళ్ తిరువాడిపుర ఉత్సవాల్లో భాగంగా ఆండాల్ అమ్మవారు తిరుచ్చిపై మాడవీధుల్లో విహరించారు. పది రోజుల పాటు నిర్వహించే ఆండాల్ తిరువాడిపుర ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. తమిళ ఆడి నెలలో పది రోజుల పాటు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య తెలిపారు. ఉత్సవాల్లో చివరి రోజైన ఈ నెల 8వ తేదీ ఆండాళ్ అమ్మవారి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఊరేగింపు నిర్వహిస్తామని తెలిపారు. శనివారం ఉదయం సుప్రభాత సేవతో అర్చకులు నిత్యపూజా కార్యక్రమాలను పూర్తి చేశారు. తిరువాడిపుర ఉత్సవాల ప్రారంభ సందర్భంగా ఆండాళ్(గోదాదేవి)కి అభిషేకం, అర్చనలను చేశారు. సాయంత్రం తిరుచ్చి వాహనాన్ని అధిరోహించిన అమ్మవారు మాడవీధుల్లో విహరించారు. ఆలయానికి చేరుకున్న ఆండాళ్ అమ్మవారికి ఆస్థానం నిర్వహించి, దూప, దీప నైవేద్యాలను సమర్పించారు. ఈ కార్యక్రమాలను ఆలయాధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్యులు తదితరులు పర్యవేక్షించారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



ధర్నా చేస్తున్న హరిజనవాడ యువకులు, పెద్దలు

నాగలాపురం: మండల కేంద్రంలోని బైటకొడియంబేడు సమీపంలో మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని బైటకొడియంబేడు హరిజనవాడకు చెందిన యువకులు, పెద్దలు శనివారం హైవేపై బైఠాయించి, ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ మండల కేంద్రంలోని బైటకొడియంబేడు సమీపంలో మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్ లేకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వెంటనే ఆ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మూడు నెలల వ్యవధిలోనే ఎంతోమంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్నారు. ఇటు తిరుపతి అటు చెన్నైకు వెళ్లే వాహనచోదకులు తరచూ ప్రమదాల బారిన పడుతున్నారన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, స్పీడ్ బ్రేకర్ ఏర్పాటుచేసి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మోసం, వంచన బాబుకు అలవాటు

- వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త రాజేష్



సత్యవేడులో.. క్యూఆర్ కోడ్ బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న నియజక వర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్

సత్యవేడు: ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు అలవాటేనని సత్యవేడు నియోజవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వకర్త నూకతోటి రాజేష్ అన్నారు. శనివారం సత్యవేడులోని బేరిశెట్టి కల్యాణ మండపంల్లో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ₹ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని పక్కన బెట్టి ప్రజలను మోసం గురి చేస్తున్నారన్నారు. ప్రతి పక్షపార్టీ నేతలపై దాడులకు పాల్పడడమే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. జిల్లాలో పెద్దిరెడ్డి కుటుంబాన్ని, పార్టీ నాయకులను వేధించడమే చంద్రబాబు, లోకేష్ పనిగా పెట్టుకున్నారన్నారు. తన జీవితాంతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిధునన్న కుటుంబంతోనే పయనిస్తామన్నారు. సూపర్‌సిక్స్ హామీల్లో ఒకటి తప్ప ఐదు ఆచరణకు నోచుకోలేదన్నారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని నూకతోటి రాజేష్ అన్నారు. పార్టీ శ్రేణులు నేరుగా తనతోనే మాట్లాడవచ్చని మధ్యవర్తులతో పనిలేదన్నారు. అనంతరం క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను పార్టీ శ్రేణులతో కలసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కే. సుశీల్ కుమార్ రెడ్డి, నాయకులు భానుప్రకాష్ రెడ్డి, ఏవీఎం బాలాజీ రెడ్డి, ఏవీఎం మునిశేఖర్ రెడ్డి, సర్పంచ్ రమేష్, సెంథిల్, పునిధకుమార్, గురుప్రసాద్, ఈ. గోవిందస్వామి, ఆనందరెడ్డి, పళణి, కష్టయ్య, ఎంపీ రవి, శరవణన్, ఇరుగుళం శేఖర్, శ్రీధర్ రెడ్డి, మాణిక్యం, ఆనందరెడ్డి, శ్రీధర్ రెడ్డి, శ్రీరాములు రెడ్డి, వెంకటేష్, కనకరాజు, దయాళన్, చిన్నబ్బ, ఇస్మాయిల్, జోషఫ్, మునికష్టయ్య, మోహన్ రెడ్డి జయ, సోము తదితరులు పాల్గొన్నారు.



బుచ్చినాయుడుకండ్రిగలో మాట్లాడుతున్న నూకతోటిరాజేష్

అధికారం కోసం మాయమాటలు

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రజలను మోసం చేయడం చంద్రబాబునాయుడుకు వెన్నతో పెట్టిన విద్య అని, అధికారం కోసమే నాడు మాయ మాటలు చెప్పారని వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజక సమన్వయకర్త నూకతోటి రాజేష్ విమర్శించారు. శనివారం బుచ్చినాయుడుకండ్రిగలో మండల కన్వీనర్ కొణతనేనిమణినాయుడు అధ్యక్షతన బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి నుంచి చంద్రబాబు చెప్పింది చేయడన్నారు. అయితే ప్రజలను మాయమాటలతో మోసం చేయడంలో ఆయన దిట్ట అన్ని విమర్శించారు. ఈ విషయాలన్నీ ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గురునాథం, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ వేలూరు రాకేష్, నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, మునిరెడ్డి, గోపాల్‌రెడ్డి, రవిరెడ్డి, బాబురెడ్డి, అజయ్‌రెడ్డి, గురవయ్య, దేవదాసురెడ్డి, ప్రసాద్‌పాల్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సేవలో పంచాయతీ సిబ్బంది



రేణిగుంటలో టీడీపీ బ్యానర్లు పంచాయతీ ట్రాక్టర్‌లో తరలించి, ఏర్పాటు చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు



రేణిగుంట ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో వ్యర్థాలు కనిపించకుండా కట్టిన పరదా

రేణిగుంట: పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా శనివారం పట్టణంలో టీడీపీ బ్యానర్లు, జెండాలు కట్టడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. పంచాయతీలోని పారిశుద్ధ్య పనులను పక్కన పెట్టి, టీడీపీ నాయకుల మెప్పుకోసం పంచాయతీ ట్రాక్టర్‌లోనే టీడీపీ జెండాలు, బ్యానర్లను తరలించి రోడ్డు పొడవున ఏర్పాటు చేశారు. దీన్ని పంచాయతీ అధికారులు పర్యవేక్షించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

వ్యర్థాలు కనిపించకుండా పరదా

ముఖ్యమంత్రి పర్యటించే రహదారిలో పక్కనున్న వ్యర్థాలు కనిపించకుండా అడ్డుగా పరదా కట్టారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి వస్తుండడంతో ఆయన ప్రయాణించే మార్గంలోనే వ్యర్థాలు అధికంగా ఉండడంతో ఎక్కడ ముఖ్యమంత్రి చీవాట్లు పెడతారేమోనన్న భయంతో అధికారులు వ్యర్థాలు కనిపించకుండా పరదా కట్టి మభ్య పెట్టే ప్రయత్నం చేశారని దారిలో వెళ్లే పలువురు చర్చించుకున్నారు.

సీఎంను కలిసిన శ్రీసిటీ చైర్మన్, ఎండీ



సీఎంతో మాట్లాడుతున్న శ్రీసిటీ చైర్మన్, ఎండీ

శ్రీసిటీ (వరదయ్యపాళెం): రాష్ట్రంలో పేదల అభ్యున్నతికి రూపొందించిన పీ4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్‌షిప్) కార్యక్రమంపై చర్చించేందుకు పరిశ్రమలు, వ్యాపార రంగాల ప్రముఖులతో శుక్రవారం తిరుపతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన విందు సమావేశంలో శ్రీసిటీ చైర్మన్ శ్రీనివాసరాజు, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పాల్గొన్నారు. శ్రీసిటీ పరిశ్రమల తరపు ప్రాతినిధ్యం వహిస్తున్న ఐఎంటీపీ ఎండీ తైజో ఇవామి, ఐసాన్ ఆటో పార్ట్స్ ప్లాంట్ హెడ్ యుచి టోమిటా ముఖ్యమంత్రిని ప్రత్యేకంగా కలిశారు. ఆయనతో పలు అంశాలపై చర్చించి పీ4 కార్యక్రమానికి తమ సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని వారు ప్రకటించారు. సమావేశ అనంతరం పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులతో డాక్టర్ సన్నారెడ్డి వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తతో సమావేశమై, శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలు, భవిష్యత్ ప్రణాళికలను వారికి వివరించారు. శ్రీసిటీని సందర్శించి, అభివృద్ధిని నేరుగా వీక్షించాలని వారిని ఆహ్వానించారు. సానుకూలంగా స్పందించిన అధికారులు, శ్రీసిటీ పారిశ్రామిక కార్యకలాపాలు తెలుసుకునేందుకు ప్రత్యేక ఆసక్తిని కనబరిచారు.

నాణ్యమైన విద్య అందించండి

బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం తెలిపారు. శనివారం బుచ్చినాయుడుకండ్రిగ, పల్లమాల, నెలవాయి గ్రామాలలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు పాఠశాల సముదాయ శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడి బయట పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు.